పెరుగు,పెరుగంటే జ్ఞాపకం వచ్చింది. కర్డుందా అంటాడు పాల్ అంటాడు. వూరగాయ అని అనకుండా పికిల్సు- పికిల్సు అని ఏడుస్తాడు. కారం ఎక్కువయితే చిల్లీస్ ఎక్కువయిందని అఘోరిస్తాడు. అన్నగారూ-భోజనం దగ్గర యింగ్లీషు మాట్లాడేవాడి మూతిపళ్ళు రాలగొట్టాలని అసెంబ్లీలో వో బిల్లు ప్యాస్ చేయించండి.

పట్టుచీరకి సిల్క్ శారీ అని బ్లవుజ్ పీస్‌కి రవికల గుడ్డ అని అనలేని స్థితికి మనం దిగజారిపోతున్నాం. రుమాలు అనడం మానేసి హేంకీ అంటున్నారు.

పెళ్ళి నిర్ణయం అయిందా అనడక్కుండా మేరేజి సెటిలయిందా అంటున్నారు నేటి నవయువక్స్.

మరి ఈ దేశాన్ని బాగుచెయ్యలేం అని ఆత్మహత్య చేసుకుంటారా లేక హత్యలు చేస్తారా? మీరే నిర్ణయించుకోవాలి!

# రోడ్లకు నా రెడ్ శాల్యూట్!

మీరెప్పుడేనా రోడ్డుకేసి చూశారా? నా మొహం ఎందుకు చూడరూ - వీధి మొహం ఎరగని వాళ్ళని ఆడాళ్ళలో కొన్ని శాల్తీలు పూర్వంవుండే వాళ్ళుగాని యిప్పుడంతా వీధిమొహా లెరుగున్నవాళ్ళే - కవులు రోడ్డెక్కుతారు. ఇంట్లో కూచుంటే మాకేం అక్కర్లేదు కాని వీధిలోకొస్తే ఏవన్నా అంటాం....టాం...టాం అని కొందరు బెదిరిస్తారుగాని - మనిషి రోడ్డున పడకుండా అతని బతుకు వెళ్ళమారదు. పూర్వం రైళ్ళలో "లుగళ బారదు" 32 జనులు కూర్చుండేది. దొంగలున్నారు జాగ్రత్త అని రాసేవారు. బస్సులవాళ్ళు రైళ్ళవాళ్ళ కంటె ఆస్తికులు, దైవచింత, పాపభీతి, బస్సులవాళ్ళకే ఎక్కువ, చేతులు బయటపెట్టరాదు, చిల్లర తెచ్చుకోవలెను లాటి షరతులతో పాటు భగవంతుని స్మరింపుము. స్త్రీలు అని కూడా రాస్తారు. బస్సులలో స్త్రీలు మాత్రమే భగవంతుని గుర్తుచేసుకోవాలని రాయడంలో ఎంతో ఔచిత్యం నాకు కనిపిస్తోంది. దేవుడెప్పుడూ వంటింట్లోనే వుంటాడు కిచెన్ గార్డ్‌లా. పొయ్యిదగ్గిర నిప్పుతో నీళ్ళతో చెలగాటమాడే పువుబోళ్ళకు గాడ్స్ గ్రేస్ వుండాలిగాని ముందు గదిలోని మందభాగ్యులకు దేవునితో పనియేమి? దేవుడెప్పుడూ పిల్లలలోనూ ఆడవాళ్ళలోనూ వుంటాడు.

ఏ రోడ్డు చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం అని ఓ పేరడీ రచయిత అన్నప్పటికీ మరో ఆధునిక కవి రోడ్లకు నమస్కారం అనేశాడు. నమస్కారం అన్న వాడిమాట వినాలా, గర్వకారణం ఏమున్నది అన్నవాడిమాట వినాలా? మీకు నమస్కారం చేస్తున్నారంటే అది పూజనీయం అనేకదా మీనింగ్. మీరు కనిపెట్టారో లేదో రోడ్డు ఎక్కడికీ వెళ్ళదు; చక్కెరకు తన తీపి తనకు తెలియనట్లు గొప్పవారికి తమవిశేషం తమకు స్పృహలో వుండదు. అడవిలో

వీరుడు నడిచిందే త్రోవ అన్నారు. వీరులు కానివాళ్ళు అడవిలోకి వెళ్ళరు. వెళ్ళినా వెనక్కి మళ్ళేవారు. వీరు లెప్పుడూ పదండి ముందుకు అని ముందుకే వెళ్తారు గ్రేట్ మార్చ్‌చేసుకుంటూ. కవులెప్పుడూ పదండి ముందుకే అని అనాలి కాని పదండి పక్కకు, పదండి వెనక్కూ అని వ్రాక్రుచ్చరాదు. రోడ్డును చూస్తే నాకే మనిపిస్తుందంటే "యిచటనే ఆగిపోనా ఎట్లైనా యిచటనే ఆగిపోనా" అని. కృష్ణశాస్త్రిగారు అంటూండేవారు రోడ్డుమీద వచ్చేపోయేవాళ్ళని చూస్తూ వీథిలో ఓ వార కుర్చీ వేసుకు కూర్చోవాలని. కూర్చోవడం అంటే పప్పు దిమ్మక్కలా కూర్చోవడం అని కాదు. ప్రవహించే జీవనదిని ఆగిపస్తాయించి చూడటం అన్నమాట. పస్తాయించటం అంటే కన్యాశుల్కం నాటకంలో మంచంకింద సీను చూడండి "ఫెడేల్మని పస్తాయిస్తే" – అన్న తరువాత పూటకూళ్ళమ్మ "నీ మగనతం ఏడిసినట్లుంది" అని రామప్పంతుల్ని ఏరి పారేస్తుంది. తిట్లు ఎప్పుడూ ఆడవారి నోటంట వింటే "మాణిక్య వీణా ముపలాలయంతీం" అన్నట్లుంటాయి. తిట్టడానికి వీణ, ఫిడేలు, తంబుర వంటి పక్క వాయిద్యాలవసరంలేదు, ఘటం అంతకంటే పనికిరాదు – వోకల్. నోటి వాయిద్యమే సరిపోతుంది.

స్ట్రీట్ కార్‌నేమ్డ్ డిజైర్ అని టెన్నిసీ విలియమ్స్ గారో నాటకం రాశారింగ్లీషులో. స్ట్రీట్ కార్ అంటే చెడిపోయిన ఆడది అనే కాదు కోరికలతో చెడిపోయిన ఆడమనిషి బతుకు స్ట్రీట్‌కార్ లాటిదని. సొంత కారులు కూడా స్ట్రీట్ మీదే నడవాలి. మన గుంటూరుకి వెళ్ళే రోడ్డుని టొబాకో రోడ్ అని పిలిస్తే ఎంతో బావుంటుంది? ప్రియురాలైన జూలియట్ కోసం పిచ్చెత్తి తిరిగిన వాడురోమియో కదా, అతగాడి పేరుమీద జులాయి వెధవల్ని ఆడపిల్లల్ని ఏడిపించే సరుకుని రోడ్‌సైడ్ రోమియోలవడం షేక్స్పియరుగారి ఆత్మకు చిచ్చురగల్చడమే. ఆడదాని మీద మగవాడు వెర్రెత్తిపోతే లోకం వాడ్ని రోడ్‌సైడుకు లాగేస్తుందని దీని తాత్పర్యం! రోడ్ అనే మహా కావ్యానికి ట్రాఫిక్ రూల్సు ఛందస్సుల్లాంటివి. ఛందస్సుల్ని చట్‌ఫట్‌మని త్రెంచితే ట్రాఫిక్ పోలీసులూరుకోరు. పద్యాల నడ్డివిరగ్గొడితే పద్యాలూరుకుంటాయేమో కాని పోలీసు లూరుకోరు.

శ్రామికుని చెమటబొట్లు రూపాయలుగా మారినట్లు పోలీసుల చెమట బొట్లు పాపాలై శాపాలై కోపతాపాలై గాలిలో కనరాని గడుసుదయ్యాలవుతాయి. రోడ్‌ను కనిపెట్టిందెవరో కాని వాడికి సహస్ర శతసహస్ర మహా ఘటాభిషేకం చేయాలి. అమృతాభిషేకమూ చేయాలి. రోడ్ ఎంత గొప్పది కాకపోతే జుత్తు పైకి దువ్వే వాళ్ళది హైరోడ్ క్రాఫ్ ఎందుకవుతుంది? మట్టి రోడ్లు కంకర రోడ్లు, తార్రోడ్లు, సిమెంటు రోడ్లు అని ఇన్ని రకాలున్నాయా – మజ్జిగ పులుసు, పప్పులుసు, గోంగూర పులుసు, తోటకూర పులుసులాగా దేని రుచి దానిదే. దేని స్టోరీ దానిదే – "పరాకు చేయుట పాడిగాదురా పరమ పురుషవరదా" అనిగాని, "రామజోగి మందూ కొనరే" అనిగాని. "శివశివమూర్తివి గణనాథా" అనిగాని భజనచేయాలంటే రోడ్డు మీదే చెయ్యాలి వూరేగింపులన్నీ రోడ్డు మీదే కదా! ఎవరి ఆఖరి వూరేగింపయినా ఆ చివరకు భస్మ సింహాసనం వైపు అటనిటాలే క్షణుండు గజ్జె కదలించియాడు రంగస్థలం వైపు సాగిపోవలసిందే.

ఈ రోడ్ ఎక్కడికి అని ఎవడో కవి అడిగాడ్ట – ఏ రోడ్ ఎక్కడికి వెళ్ళినా నువ్ ఎక్కడికెళ్ళాలో అక్కడికే వెళ్తావు. కాని రోడ్ చివరికంటా వెళ్ళలేవు కదా అన్నాడ్ట వో నిరాశావాది.

రోడ్ అనేది వేస్తే నేను కాకపోతే నా మనవడేనా వెళ్తాడన్నాడ్ట ఆశావాది!

అందుకే 'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అన్నట్లు కవి సంధ్యావందనం చేస్తూ రోడ్లకు నమస్కరిస్తున్నాడు.

# రౌడీ రాణి

వేదాల్లో అన్నీ వున్నాయంటారుగాని వేదకాలంలో ఇన్ని మునిసిపల్ టాక్సులూ, నీటి పన్నులూ, ఎలక్ట్రీబిల్లులూ వుండేవా? దేవుళ్ళు మటుకు గద్దనో, హంసనో, నెమలినో, పులినో, సింహాన్నో ఎక్కి తిరిగేవారు గనుక డీసెల్, పెట్రోలు ధరలు పెరిగినా వాళ్ళకేం యిబ్బంది లేదు. మన పురాణ పురుషులకి ఎంతమంది భార్యలూ, సంసారాలున్నా వాళ్ళకిగుళ్ళూ, గోపురాలు వుంటాయి గనుక అద్దెకొంపల అగచాట్లు వారికి తెలీవు. ఋషులూ, మునిపత్నులూ అవుట్ డోర్‌లో, ఆశ్రమాల్లో వుంటారు గనుక మురిక్కాలవల సంగతీ పంపుల్లోంచి నీళ్ళు రాక పోవడం, గ్యాస్ సడెన్‌గా అయిపోయి వంటమధ్యలో ఇల్లాలు కుదేలైపోయి కాళ్ళూ, చేతులూ బాదుకోవడం ఆ మహా పతివ్రతలు ఎరగ రెరగరు. ఈ రోజుల్లో లాగా ఈ జానెడు బెత్తెడు జాగాల్లో పవర్ సరిగాలేక, శాలరీలు చాలక, పిల్లల్తో జల్లల్తో సంసారాలీదవడం మజాకా కాదని ఆ పతివ్రతలకు తెలియదు. బస్సులో సీటు దొరకడం నుంచి స్కూల్లో, కాలేజీల్లో పిల్లలకి సీట్లు తెప్పించి వాళ్ళని చేర్చేసరికి చుక్కలు కనిపిస్తాయి. అప్పటి పతివ్రతలకు మొగుడి కాళ్ళు పిసకడం, నెత్తిమీద గంపలో కూర్చోపెట్టుకుని ముండ యింటికి తీసుకెళ్ళడం, తెల్లారడానికి వీల్లేదని సూర్యభగవానుడ్ని శపించడం పాపం యివే గొప్ప విషయాలు.

కాని, ఈనాటి పతివ్రతల కష్టాలతో పోలిస్తే వాళ్ళవి అవుట్ డేటెడ్ కష్టాలు. ఇల్లు విషయమే తీసుకోండి. ఇల్లు చూసి ఇల్లాలిని చూడమన్నారు. మళ్ళీ వాళ్ళే ఇల్లు యిరకాటం ఆలి మర్కటం అన్నారు. అన్యాయం; ఈ రోజుల్లో ఇల్లాలిని చూసి ఇల్లు జడ్జి చెయ్యడానికి వీల్లేదు. దొరికిన యింట్లో తలదాచుకుంటున్నారు. తోటలూ దొడ్లూ, ఉద్యానవనాలు, లతానికుంజాలు లేనేలేవు. ఒకటిన్నర, రెండున్నర గది వాటాలే యెక్కువ. డ్రాయింగ్‌రూములూ, బెడ్రూములూ, డైనింగ్ హాల్సు యెందరి కున్నాయి? మంచం వాలిస్తే కుర్చీ వేయడానికి వీల్లేదు. కుర్చీవాలిస్తే మంచం యెత్తేసెయ్యాలి. ఇలాటి యిళ్ళలో నీళ్ళు లేక, పనివాళ్ళు సరిగా రాక సతమతమయే చిన్నారి ఇల్లాలు పగటి కలలూ, వరసగా పిల్లల్ని తప్ప మరింకేం కనగలదు? ఇప్పుడు ఇంట్లో బట్టలన్నీ మెరుపుల్తో తళతళలాడేలా వుతికి, ఆరేసి, ఇస్త్రీ చేయించే లాండ్రీ సమస్య కూడా ఇల్లాలి